క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పెద్దమ్మకు పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దొర్నిపాడు:మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె గ్రామంలో వెలసిన మూలపెద్దమ్మకు ఆదివారం భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఉదయమే అమ్మవారిని నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. చీర, సారె, నూతన చీరలు, పిండివంటలు అమ్మవారికి సమర్పించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

శోభాయాత్రను విజయవంతం చేద్దాం



మాట్లాడుతున్న బీజేపీ మండల అధ్యక్షుడు గురుబ్రహ్మం

నంద్యాల(అర్బన్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ నంద్యాల పర్యటన సందర్భంగా సోమవారం పట్టణంలో నిర్వహించే శోభాయాత్రను విజయవంతం చేద్దామని ఆ పార్టీ నంద్యాల మండల అధ్యక్షుడు గురుబ్రహ్మం అన్నారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పద్మావతినగర్ ఆర్చి నుంచి సౌజన్య కల్యాణ మండపం వరకు ఈ యాత్ర సాగుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు వేలాదిగా పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తూముశివారెడ్డి, రామచంద్రారెడ్డి, బ్రహ్మయ్య ఆచారి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శస్త్ర చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న డాక్టర్లు

గోస్పాడు: చెవి, ముక్కు, గొంతు ఉచిత శస్త్ర చికిత్స శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మధుమణి నర్సింగ్ హోం ఈఎన్‌టీ వైద్యులు మధుసూదన్‌రావు తెలిపారు. నంద్యాల పట్టణంలోని నర్సింగ్ హోంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఏడాది సెప్టెంబర్ 2 నుంచి 7వ తేదీ వరకు మధుమణి చారిటబుల్ సొసైటీ ద్వారా ఉచిత శస్త్ర చికిత్స శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ చికిత్స అవసరమైన పేదలు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఉచిత శిబిరానికి సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

ఆదర్శనీయులు అబ్దుల్‌కలాం



మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలాంకు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రపంచం మెచ్చిన మేధావి అబ్దుల్ కలాం జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని యువత ముందుకు పోవాలని పట్టణ సీఐ యుగంధర్ అన్నారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్‌కలామ్ వర్ధంతి సందర్భంగా ఆదివారం పట్టణ పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న అబ్దుల్‌కలామ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం మొక్క నాటారు. కార్యక్రమంలో డాక్టర్ రామ్‌గోపాల్‌రెడ్డి, అమీర్‌బాషాలు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో రమ్ ఖాశీం జియారత్



కొండమాయపల్లెలో ఫాతేహాలు సమర్పిస్తున్న భక్తులు

రుద్రవరం: మండల పరిధిలోని కొండమాయపల్లెలో ఆదివారం రమ్‌ఖాశీంస్వామి పీరుకు భక్తి శ్రద్ధలతో జియరత్ వేడుకలు నిర్వహించారు. మొహర్రం వేడుకలు ముగిసిన 21 రోజులకు ఇక్కడ జియారత్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. ఇందులో భాగంగానే చావిడి నిర్వాహకులు రమ్‌ఖాశీం స్వామి పీరును ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్థానికులు ఫాతేహాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

కౌలు రైతుకు 'సాగు' కష్టాలు

- ఏటేటా పెరుగుతున్న కౌలు ధరలు
- ప్రభుత్వం నుంచి అందని పెట్టుబడి సాయం
- కౌలు కార్డుల జారీ, రుణాల మంజూరులో నిర్లక్ష్యం
- చివరకు పంటలు పండక అప్పుల పాలు

వ్యవసాయంపై మక్కువతో కొందరు భూమిని కౌలుకు తీసుకొని పంటలు పండిస్తున్నారు. అయితే, ఈక్రమంలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకులు రుణాలు ఇవ్వక, ప్రభుత్వం నుంచి సాయం అందక పెట్టుబడుల కోసం అవస్థలు పడుతున్నారు. వడ్డీలకు తెచ్చి పంటలు సాగు చేస్తున్నారు. చివరకు పంట చేతి కొచ్చే సమయంలో ప్రకృతి కన్నెర్ర చేయడం, మద్దతు ధర లభించకపోవడం ఇలా వివిధ కారణాలతో అప్పుల ఊబిలో చిక్కుకుంటున్నారు.



గోస్పాడు శివారులో మొక్కజొన్న సాగుచేసిన కౌలు రైతు

గోస్పాడు: నంద్యాల నియోజకవర్గ పరిధిలో గోస్పాడు, నంద్యాల మండలాల్లో సుమారు 4 వేల మందికి పైగా కౌలు రైతులు ఉన్నారు. వీరికి గతేడాది ఆశించిన స్థాయిలో దిగుబడులు రాకపోయినా మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ఇప్పటికే చాలామంది వరి, మినుము, మొక్కజొన్న, శనగ, మిరప, సోయాబీన్, జొన్న, పత్తితో పాటు పలు రకాల పంటలను సాగు చేస్తున్నారు.

కౌలు కార్డుల జారీలో నిర్లక్ష్యం

రెండు మండలాల పరిధిలో 3,100 కౌలు కార్డుల లక్ష్యం కాగా ఇప్పటికీ 950 కౌలు కార్డులు మాత్రమే అందజేసినట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు. ఓ వైపు భూ యజమానులు కౌలురైతులకు అగ్రిమెంట్ చేసేందుకు ముందుకు రాకపోవడం, మరోవైపు నిబంధనల పేరుతో కార్డుల జారీలో అధికారులు జాప్యం చేస్తున్నారు. దీంతో ఏటా అరకొర మందికే కౌలుకార్డులు అందుతున్నాయి. వీరికి మాత్రమే సర్కారు నుంచి సాయం అందుతుంది. అయితే, గతేడాది నుంచి కూటమి సర్కారు అన్నదాత సుఖీభవ పథకాన్నే అమలు చేయలేదు. దీంతో రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.

పెరిగిన కౌలు ధరలు...

నియోజకవర్గంలో వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగించే వారిలో కౌలు రైతులు కూడా ఎక్కువగా ఉన్నారు. అయితే, వీరికి సొంత భూములు కలిగిన రైతులు ముందస్తు కౌలు అడుగుతుండటంతో పాటు వాటి కౌలును కూడా ఎప్పటికప్పుడు పెంచుతుండటంతో ఇబ్బందులు పడాల్సి వస్తుంది. గోస్పాడు మండలంలో ఎక్కువ భాగం పొలాలకు కేసీ, కుందూ నీరు పారుతుంది. దీంతో భూ యజమానులు కౌలు అధికంగా డిమాండ్ చేస్తున్నారు. సాగు చేసే పైర్లను బట్టి ఎకరా రూ. 15 నుంచి రూ.50 వేలు పలుకుతున్నాయి. అయితే వరిపైరుకు రూ. 18 వేల నుంచి రూ. 25 వేలు, మెట్టపైర్లు జొన్న, మొక్కజొన్న, మినుము, శనగ వంటి వాటికి రూ. 12 నుంచి రూ. 20 వేలు, మిరప పైరుకు అత్యధికంగా రూ. 30 నుంచి రూ. 50 వేల వరకు కౌలు చెల్లించాల్సి వస్తుంది. ఇంత మొత్తం చెల్లించి పంటలు వేస్తే చివరకు దిగుబడులు రాక, మద్దతు ధర లభించక నష్టపోవాల్సిన పరిస్థితి వస్తుంది.

నాడు అన్ని విధాలుగా ఆదుకున్న జగన్ సర్కారు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయం పండుగలా సాగింది. అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కౌలు రైతులను అన్నివిధాలా ఆదుకున్నారు. భూ యజమానుల హక్కులకు భంగం కలగకుండా కేవలం 11 నెలల కాలానికి సాగు ఒప్పందం చేస్తూ కౌలు చట్టాన్ని సవరించి ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి ఒకసారి జారీ చేసిన కార్డును మరలా యజమాని అంగీకారంతో రెన్యూవల్ చేసుకునే వీలు కల్పించారు. అంతేకాదు బ్యాంకర్లతో మాట్లాడి కౌలు రైతులకు పంట రుణాలను అందించడంతో పాటు రైతు భరోసా, పంటల బీమా పరిహారం అందించి ఆదుకున్నారు. ప్రస్తుతం కూటమి సర్కారులో ఇవేమీ లేకపోవడంతో కౌలు రైతులు పరిస్థితి దయనీయంగా మారింది.

రుణాల ఊసేలేదు

గత ఏడాది జిల్లాలోని కౌలు రైతులకు రూ. 130 కోట్ల మేర రుణాలు ఇవ్వాలని లక్ష్యం. ఇందులో రూ. 26.88 కోట్లు మాత్రమే ఇచ్చారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు గడుస్తున్నా కౌలు కార్డుల పంపిణీ జరగలేదు.దీంతో కౌలు రైతులు ఇప్పటి వరకు రుణం పొందలేని పరిస్థితి. ప్రభుత్వం సైతం పెట్టుబడి సాయం అందించలేదు. అన్నదాత సుఖీభవ పథకం అమలు చేస్తామని ఎన్నికల ముందు ప్రకటించి ఇప్పటి వరకు ఆచరణలో పెట్టలేదు.

కౌలు ధరలపై నియంత్రణ ఉండాలి



గత ఏడాది నాలుగున్నర ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని పైర్లు సాగుచేశాను. అయితే, కౌలు కార్డుకు దరఖాస్తు చేసినా కార్డుకూడా అందలేదు. పైర్లు పూర్తై పంటకోత అనంతరం రూ. లక్ష దాకా నష్టం వచ్చింది. ప్రతి ఏడాది ఏదో ఒక రూపంలో నష్టపోవాల్సి వస్తుంది. కౌలు రైతులను దృష్టిలో ఉంచుకొని సర్కారు కౌలు ధరలు భారీగా పెంచకుండా నియంత్రణ చేయాలి – **చెన్నయ్య, సీపీఎం నాయకుడు, వసురపాడు**

ప్రభుత్వం ఆదుకోవాలి



నేను కౌలుకు పొలం సాగుచేస్తున్నా. కౌలు కార్డు ఉన్నా రుణాలు లేవు. ప్రభుత్వం నుంచి సాయం లేదు. మరోవైపు కౌలు ధరలు పెరిగాయి. దిగుబడులు చూస్తే అంతంత మాత్రంగానే వస్తున్నాయి. గతేడాది రెండు ఎకరాల్లో మిరప సాగు చేశా. దాదాపుగా రూ. 5 లక్షలకుపైగా ఖర్చు చేశాను. క్వింటా మిరపకు రూ. 8 వేలకు మించి ధర పలకలేదు. ఎకరాకు పది క్వింటాళ్లలోపే దిగుబడి రావడంతో పెట్టుబడి ఖర్చులు కూడా చేతికందక తీవ్రంగా నష్టపోయాను.– **తలారి నాయుడు, కౌలురైతు, ఎస్.కూలూరు**

నంద్యాల కవికి సన్మానం



కొప్పుల ప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పోలీసులు– సామాజిక బాధ్యత, అధికారులు–బాధ్యతలు అనే అంశంపై హైదరాబాద్‌లో కవితాగానం చేసిన నంద్యాలకు చెందిన ప్రముఖ కవి కొప్పుల ప్రసాద్‌ను ఆదివారం ఘనంగా సత్కరించారు. తెలంగాణ పోలీసు శాఖ, జాతీయ తెలుగు సారస్వత పరిషత్, జ్యోతి జాతీయ తెలుగు దినపత్రిక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో కొప్పుల ప్రసాద్‌ను తెలంగాణ పోలీసు శాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.రమేష్, తెలుగు సారస్వత పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు శివరాజు సన్మానించారు.

మహానందిలో భక్తుల సందడి



దర్శనానికి క్యూలైన్‌లో వెళ్తున్న భక్తులు

మహానంది: సెలవు రోజు కావడంతో క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని స్థానిక కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరి దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకున్నారు. స్వామి, అమ్మవారి దర్శనం అనంతరం కోదండ రామాలయం, ఆంజనేయస్వామి, వినాయక నంది, గరుడ నంది ఆలయాలను భక్తులు సందర్శించారు.

రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా



గోవిందపల్లెలో పల్లె నిద్ర చేస్తున్న డీఎస్పీ

శిరివెళ్ల: రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా పెట్టాలని డీఎస్పీ ప్రమోద్ పోలీసు సిబ్బందిని ఆదేశించారు. శనివారం రాత్రి మండలంలో అత్యంత సమస్యాత్మక గ్రామం గోవిందపల్లెలో పల్లె నిద్ర చేశారు. ఈ సందర్భంగా పికెట్‌ను తనిఖీ చేసి బందోబస్తు తీరును పరిశీలించారు. గ్రామంలో ఎలాంటి అసాంఘికిక శక్తులు రాకుండా చూడాలన్నారు. చట్ట విరుద్ధ కార్యకలాపాలను ఎటువంటి పరిస్థితిలో అనుమతించవద్దని సీఐ, ఎస్‌ఐలను ఆదేశించారు. సీసీ కెమెరాలను ఎప్పటి కప్పుడు అప్‌డేట్ చేస్తుండాలన్నారు. అనంతరం ప్రజలతో మాట్లాడుతూ గ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడమే తమ లక్ష్యమన్నారు. గొడవలకు దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఫ్యాక్షన్ వల్ల ప్రాణ, ఆస్తి నష్టం కలుగుతుందన్నారు. ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సబ్ డివిజన్‌లోని సమస్యాత్మక గ్రామాల్లో పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీఐ దస్తగిరిబాబు, ఎస్‌ఐ చిన్న పీరయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌బాబు

నంద్యాల(న్యూటౌన్): ప్రకృతి వ్యవసాయ సహాయకులకు పెండింగ్ వేతనాలు చెల్లించి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ, ఏపీ ప్రకృతి వ్యవసాయ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రమేష్‌బాబు, శ్రీధర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని రామకృష్ణ డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ప్రకృతి వ్యవసాయం జిల్లా నిర్మాణ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ సహాయకులకు ఇచ్చే అరకొర గౌరవ వేతనం కూడా 12 నెలలుగా ఇవ్వకపోతే ఎలా అని ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చొరవ తీసుకొని వెంటనే వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.అలాగే పీఎఫ్, ఈఎస్‌ఐ సదుపాయం కల్పించాలన్నారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా గౌరవాధ్యక్షుడిగా సుంకయ్య, అధ్యక్షురాలిగా నిర్మల, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామాంజి, ఉపాధ్యక్షుడిగా కలీముల్లా, మాబాషా, ప్రసాద్, రఘురామయ్య, ప్రధాన కార్యదర్శిగా రామమద్దయ్య, డిప్యూటీ ప్రధాన కార్యదర్శిగా కుళాయి స్వామి, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా చంద్రిక, కార్యదర్శులుగా లోకేష్, సుబ్బరాయుడు, రాజశేఖర్, రంగారెడ్డి, కోశాధికారిగా అయ్యప్పస్వామితో పాటు 20 మంది కమిటీ సభ్యులను ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో రాజకీయం



మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీల్లో రాజకీయ నాయకుల ప్రమేయం పెరిగిపోయిందని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలో ఇటీవల నిర్వహించిన బదిలీల్లో కొందరిని నిబంధనలకు విరుద్ధంగా బదిలీ చేశారని, దీనిపై విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ అంశంపై లోకాయుక్తకు కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యేల సిఫార్సులకు బదిలీల్లో ప్రాధాన్యత ఇచ్చారన్నారు. దీనిపై సమగ్రంగా విచారించాలని లేని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

రైతునగర్‌లో స్థల వివాదం.. స్వల్ప ఉద్రిక్తత



రెవెన్యూ రికార్డుల ప్రకారం కంచె ఏర్పాటు చేస్తున్న దృశ్యం



స్థలం వద్ద పోలీసులు

నంద్యాల(అర్బన్): పట్టణంలోని రైతునగర్ వద్ద స్థల సమస్య వివాదాలకు దారి తీసింది. స్థలం తమదేనంటూ ఆళ్లగడ్డకు చెందిన శ్రావణిరెడ్డి ఓ వైపు.. గతంలో గవర్నర్ కృష్ణకాంత్ పేరు మీద 30 సెంట్లు శ్మశాన వాటిక, 16 సెంట్లు దోబీఘాట్లపై రిజిస్టర్ పట్టాలు ఉన్నాయని గ్రామస్తులు మరో వైపు వివాదానికి దిగడంతో రూరల్ పోలీసులు రంగప్రవేశం చేయాల్సి వచ్చింది. సర్వేనం.110లో 46 సెంట్లలో శ్మశాన వాటిక, ధోబీఘాట్లకు సంబంధించి రిజిస్టర్ పట్టాలు ఉన్నాయి. స్థానికంగా ఉన్న నాలుగున్నర ఎకరాల పొలం తమదేనంటూ ఇటీవల ఆళ్లగడ్డకు చెందిన శ్రావణిరెడ్డి బహిరంగంగా చెబుతుండగా పక్కనున్న 46 సెంట్ల స్థలం కూడా తనదేనని చెప్పడంతో గ్రామస్తులు ఆదివారం మూకుమ్మడిగా గవర్నర్ పేరుపై రిజిస్టర్ అయిన స్థలం తమదంటూ చెప్పడానికి ఆధారాలు ఏమున్నాయంటూ శ్రావణిరెడ్డిని గ్రామస్తులు ప్రశ్నించారు. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి రెవెన్యూ అధికారులు రికార్డులను పరిశీలించాలని కోరగా అందులో 46 సెంట్లు గ్రామస్తులకే సంబంధించిందేనని తెలపడం, తక్షణమే మార్కింగ్ వేసి కంచె పాతడంతో వివాదం సర్దుమణిగింది.

ధర్మకర్త నియామకంపై విచారణ

నంద్యాల(వ్యవసాయం): బండి ఆత్మకూరు మండలం కడమలకాల్వ గ్రామ మజరా క్రిష్ణనంది క్షేత్రంలో శ్రీవిష్ణునందీశ్వరస్వామి దేవస్థానానికి వంశపారంపర్య వ్యవస్థాపక ధర్మకర్త నియామకంపై ఆగస్టు 1న కర్నూలు దేవదాయ శాఖ కమిషనర్ విచారణ చేయనున్నట్లు ఈఓ వేణునాథరెడ్డి తెలిపారు. విష్ణునందీశ్వరస్వామి దేవస్థానానికి వంశపారంపర్య వ్యవస్థాపక ధర్మకర్తగా ప్రస్తుతం చిట్టిబొట్ల భరద్వాజశర్మ ఉన్నట్లు వెల్లడించారు.

నేడు పీజీఆర్ఎస్

ఉయ్యాలవాడ : స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సువర్ణాదేవి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలపై మండల ప్రజలు వినతులు అందజేయవచ్చునని వెల్లడించారు. మండల పరిషత్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని సూచించారు.

చిరుద్యోగులపై కక్ష సాధింపు సరికాదు

గోస్పాడు: చిరుద్యోగులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడం మంచి పద్ధతి కాదని యాళ్లూరు సర్పంచ్ గడ్డం రత్నమ్మ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొన్ని సంవత్సరాలుగా తమ గ్రామంలోని సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో బాలవుశేని, ప్రతాప్ అనే ఇద్దరు సెక్యూరిటీ గార్డులుగా పనిచేస్తున్నారన్నారు. అయితే, రాజకీయ నాయకుల ఒత్తిడితో వారిని విధుల నుంచి తప్పించేందుకు ఆసుపత్రి వైద్యాధికారులు చర్యలు చేపట్టారన్నారు.

విద్యుత్ వినియోగదారులు సహకరించాలి

నంద్యాల(అర్బన్): ఆత్మకూరు బస్టాండ్ వద్ద ఉన్న సప్తగిరి సబ్ స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు గురికావడంతో కలుగుతున్న విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఏఈ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసినా విద్యుత్ సరఫరాలో అక్కడక్కడా అంతరాయం ఏర్పడుతుందన్నారు. త్వరలో కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి సమస్యను పూర్తిగా పరిష్కరిస్తామని వెల్లడించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి



సమావేశానికి హాజరైన ఎంపీటీసీలు, సర్పంచులు

ఆళ్లగడ్డ: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వాధులు ప్రబలకుండా తగు చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీడీఓ నూర్జహాన్ అధ్యక్షతన ఆదివారం సాధారణ మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ మాట్లాడుతూ స్థానిక అధికారులు ప్రజా ప్రతినిధులను కలుపుకుని గ్రామాల్లో పర్యటించాలన్నారు. అలాగే గుర్తించిన సమస్యల పరిష్కారానికి వెనువెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయి అధికారులు సమావేశానికి వచ్చే సమయంలో వారి శాఖకు సంబంధించిన పూర్తి సమాచారంతో రాకపోవడంతో అసహనం వ్యక్తం చేశారు. సమావేశానికి గైర్హాజైన వారిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. గ్రామాల్లో జరిగే ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రొటోకాల్ ఉల్లంఘన జరుగుతోందని, ఈ విషయం కూడా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు వెల్లడించారు.

కేసీ కెనాల్‌కు 1,900 క్యూసెక్కుల నీరు

పాములపాడు: సుంకేసుల నుంచి కర్నూలు–కడప కెనాల్‌కు 1,900 క్యూసెక్కుల నీరు విడుదలవుతోందని ఏఈ శ్రీనివాసనాయక్ ఆదివారం తెలిపారు. మండలంలోని శాంతినిలయం గ్రామం సమీపంలో కేసీ కెనాల్ 120 కిలో మీటరు లాకీన్సలా వద్దకు 1200 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందన్నారు. కాగా ఈ నీటిని తూడిచెర్ల సబ్‌చానల్‌కు 250 క్యూసెక్కులు, నిప్పులవాగుకు 944 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నట్లు తెలిపారు. అలగనూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు గేట్లు బంద్ చేసినట్లు వివరించారు.

మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలి



సంఘీభావం తెలుపుతున్న జీపీఎస్ నాయకులు

నంద్యాల(అర్బన్): రాష్ట్రంలోని మైదాన ప్రాంత గిరిజనులకు రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని జీపీఎస్ జాతీయ అధ్యక్షుడు రాష్ట్ర మాజీ ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్య శంకర్‌నాయక్ కోరారు. గిరిజన హక్కుల పరిరక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. గిరిజన ప్రజల్లోకి.. గిరిజన ప్రజా చైతన్య యాత్రపై పట్టణంలోని స్థానిక సూరజ్ హోటల్‌లో ఆదివారం గిరిజన సంఘాల ముఖ్యనాయకులు మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వడిత్య శంకర్‌నాయక్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్య్రం సిద్ధించి ఏడు దశాబ్దాలు గడిచినా రాష్ట్రంలో లక్షలాదిమంది గిరిజనులు కూడు, గూడు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గిరిజనులకు మన్యం ప్రాంతాలకు పరిమితం చేయకుండా రాజకీయ రిజర్వేషన్లు కల్పిస్తే చైతన్యం వస్తుందన్నారు. ఈ సందర్భంగా ప్రముఖులతో కలిసి గిరిజన ప్రజా చైతన్య యాత్ర వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, బాలానాయక్, రవినాయక్, సాయినాయక్, విష్ణునాయక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు తిష్ట

- మిట్నాలలో మౌలిక సదుపాయాలు కరువు
- అధ్వానంగా రోడ్లు, డ్రైనేజీలు
- క్లోరినేషన్ లేని తాగునీరు సరఫరా
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు



క్లోరినేషన్ లేని ఎస్సీ కాలనీ కుంట నీరు



ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు



బీసీ కాలనీలోని డ్రైనేజీ కాల్వలో పెరిగిన గడ్డిమొక్కలు

నంద్యాల(అర్బన్): మండలంలోని మిట్నాల గ్రామ పంచాయతీలో సమస్యలు తాండవిస్తున్నాయి. ఎక్కడ చూసినా చెత్తా చెదారం కనిపిస్తోంది. చిన్న పాటి వర్షానికే దారులన్నీ బురదమయమవుతున్నాయి. వర్షపు నీరు రోడ్లపై రోజుల తరబడి నిలిచిపోతుండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. పంచాయతీ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఎన్నికల సమయంలో రాజకీయ నాయకులు రావడం.. పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని చెప్పి ఓట్లు వేయించుకోవడం, అధికారంలోకి రాగానే విస్మరించడం పరిపాటిగా మారింది.

పట్టించుకోని అధికారులు..

ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న డ్రైనేజీ కాల్వల వెంట కంప చెట్లు అల్లుకుపోయాయి. ఎస్సీ కాలనీలో సైతం ముళ్ల కంపలు పెరిగి రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎదురుగా ఎవరు వస్తున్నారో కనిపించని పరిస్థితి. సచివాలయం, ఆర్‌బీకే కేంద్రం, బల్క్‌మిల్క్ కేంద్రం, హెల్త్ క్లీనిక్ సెంటర్లు ఒకే చోట ఏర్పాటై ఉండటం, అక్కడికి పోయే రహదారి నిత్యం బురదమయమవుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వీటిని పట్టించుకోవాల్సిన అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ప్రధాన డ్రైనేజీల్లో చెత్తా చెదారం పేరుకొని పోతుండటంతో వర్షపు నీరు, మురుగునీరు వెళ్లలేక ఇళ్లలోకి వస్తుందన్నారు. అక్కడక్కడ రిజర్వ్ స్థలాల్లో ముళ్ల కంపలు, గడ్డిమొక్కలు ఏపుగా పెరగడంతో పాముల సంచారం అధికమైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థలాల యజమానులకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాల్సిన పంచాయతీ సిబ్బంది ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. గతంలో తాగునీటి కోసం ఏర్పాటు అయిన కుంటల్లో క్లోరినేషన్ చేయకపోవడంతో నీటిలో పురుగులు వస్తున్నా పంచాయతీ పాలకులు పట్టించుకోవడం లేదు. అధికారులు ఇప్పటికైనా నిర్లక్ష్యం వీడి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.